కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం

■ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఏప్రిల్ 30: సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ముఖ్య మంత్రి అన్న పదాన్ని మర్చి పోయి ఇంకా పీసీసీ అధ్యక్షుడి హోదాలోనే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ లోని తిరుమల్ నగర్‌లో చేవెళ్ల పార్లమెంటు ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాలనీ వాసులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో నిర్మాణమవుతున్న మిషన్ భగీరథ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీల్లో ప్రజలు గొంతులు ఎండుతున్నాయని గగ్గోలు పెడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కాలనీల్లో కనీసం బోర్లు వేసి నీటి సరఫరా చేయవలసిన అధికారులు సైతం పట్టించుకోక పోవడం పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ముఖ్య మంత్రి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, హామీలు నెరవేర్చమని ప్రతి పక్షాలు అడిగితే నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో తొమ్మిది సంవత్సరాల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికి అప్పుడు పరిష్కరించడం జరిగిందన్నారు. పాలన వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా తయారు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

బీసీల గొంతుక కాసాని...

చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపును ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలో ఎక్కడ పోయినా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. గతంలో ఎమ్మెల్సీగా, రంగారెడ్డి జడ్పీ చైర్ పర్సన్‌గా కాసాని ఎంతో సేవ చేశారన్నారు. పార్లమెంటుకు పంపిస్తే బీసీ గొంతుగా బీసీల సమస్యలపై పోరాడుతారని అన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు బోయల్లి శేఖర్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

తిరమల్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

గంజాయి విక్రేతలు అరెస్ట్

మన్సూరాబాద్, ఏప్రిల్ 30: గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు యువకులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి 1.5 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్, సాయి బాబా కాలనీకి చెందిన కొలటం వెంకట్‌సాయి అలియాస్ వెంకట్ వృత్తి రీత్యా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఉప్పల్, విజయపురికాలనీకి చెందిన బడ్డితి సైమన్ అలియాస్ సైమన్‌రాజ్ చదువుకుంటున్నాడు. గంజాయిని సేవించడంతో పాటు జల్సాలకు అలవాటుపడ్డారు. తమ కోరికలను తీర్చుకునేందుకు వెంకట్, సైమన్‌రాజ్ గంజాయిని కొనుగోలు చేసి అధిక లాభాలకు విక్రయించడం మొదలు పెట్టారు. వెంకట్, సైమన్‌రాజ్ గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న విషయం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నిఘా పెట్టారు. నాగోల్, శ్రీలక్ష్మీనర్సింహా కాలనీ, మూసీ సమీపంలో గంజాయిని విక్రయిస్తుండగా మంగళవారం వెంకట్, సైమన్‌రాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి,1.5 గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న నరేశ్‌గౌడ్ పరారీలో ఉన్నాడు.

గళం వినిపించాలంటే కారు గుర్తుకు ఓటెయ్యాలి

ఆర్కేపురం, ఏప్రిల్ 30 : పార్లమెంట్‌లో తెలంగాణ గళం విప్పాలి అంటే కారు గుర్తుకు ఓటెయ్యాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సరూర్‌నగర్ డివిజన్‌లో సీనియర్ సిటిజన్‌లు, హుడా మహిళా సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంపై ఒక విజన్ ఉన్నటువంటి నాయకుడు అని అన్నారు. కార్యక్రమంలో లోకసాని కొండల్‌రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, మహేందర్‌యాదవ్, సిరిపురం రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే భవిష్యత్ అంధకారం

ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూతురు మౌనికారెడ్డి

మన్సూరాబాద్, ఏప్రిల్ 30: మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూతురు రాగిడి మౌనికారెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మంగళవారం సాయంత్రం మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మితో కలిసి ఆమె సహారా స్టేట్స్‌కాలనీ సమీపంలోని వారాంతపు సంతలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మౌనికారెడ్డి మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి మద్దతుగా నిలువాలని కోరారు. డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మౌనిక, శ్వేత, శిరీష, సుజాత, యామిని, అనూష, కీర్తి, జయశ్రీ, మమత, మానస, మణెమ్మ, లిఖిత, సుష్మ, భాగ్యమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పాతబస్తీని పట్టించుకోని అసదుద్దీన్ ఒవైసీ

సైదాబాద్, ఏప్రిల్ 30 : బీజేపీ, మజ్లిస్ పార్టీలు పాతబస్తీ ప్రజలను ఎన్నికల్లో మభ్యపెట్టేందుకు కొత్త ఎత్తుగడకు తెరలేపాయని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సామ సరస్వతీ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 40 ఏండ్లుగా పాతబస్తీ అభివృద్ధి కోసం మజ్లిస్ పార్టీ ఏమీ చేసిందని, ఎంపీగా పనిచేస్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపించాలని ప్రశ్నించారు. యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి అజం అలీ, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్ రెడ్డి, నాయకులు మహేందర్ యాదవ్, ప్రవీణ్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ యాదవ్

శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

సైదాబాద్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల పోలింగ్ విధులను నిర్వహించనున్న ప్రొసిడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రోసిండ్ పోలింగ్ ఆఫీసర్స్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం మలక్‌పేట ముంతాజ్ కాలేజ్ ఆవరణలో ప్రారంభించారు. రెండు రోజులపాటు జరగనున్న శిక్షణ కేంద్రాన్ని హైదరాబాద్ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌వో రాజేశ్‌కుమార్, నోడల్ అధికారి యుగేందర్ రెడ్డి, సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎంకు మద్దతుగా ప్రచారం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 30: నియోజకవర్గం అభివృద్ధిలో రాజీలేకుండా పనులు చేపడుతున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే అహ్మద్ బలాల హైదరాబాద్ పార్లమెంట్ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా ఛావునీ డివిజన్ లోని ఇబాదత్‌వుల్లా మసీదు, వస్తాదీ మాకి ఘల్లీ, జం జం మెడికల్ హాల్, సిటీ స్కూల్, అబ్దార్ కానా, బాబా స్వీట్ హౌజ్, అలీ మసీదు, డబీర్‌పురా బ్రిడ్జి లేన్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ సలాం షాహీద్ ఉన్నారు.

త్రివేణి నగర్‌లో 14 మంది పై కుక్కలు దాడి

బడంగ్‌పేట, ఏప్రిల్30: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రివేణి నగర్‌లో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. ఏకంగా 14 మంది పై దాడి చేసి గాయాలు చేశాయి. వరుస సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించు కోక పోవడం పై బాధితులు మండి పడుతున్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని త్రివేణి నగర్‌కు చెందిన రోహిన్ పై కుక్క దాడి చేసింది. బాబును పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. వృద్ధుడు దాసు బయటకు రాగానే కుక్క ఒక్కసారిగా ఎగిరి గొంతు పట్టుకోబోయింది. రెండు చోట్ల కరిచిందని బాధితుడు పేర్కొన్నాడు. కుక్కల బెడద లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశాడు. అలానే దారి వెంట పోతున్న వారి పై కక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఆదారి వెంట పోవాలంటేనే ప్రజలు భయ పడుతున్నారు. కాలనీ వాసులు కొంత కాలం నుంచి కుక్కల బెడద లేకుండా చేయాలని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ లో పలుమార్లు ఫిర్యాదులు చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14 వ డివిజన్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన ఎవరు పట్టించు కోవడం లేదని కార్పొరేటర్ కరుణనిధి అన్నారు.

బాలుడి వీపుపై దాడిచేసిన కుక్కలు

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

మన్సూరాబాద్, ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఎంఈరెడ్డి గార్డెన్‌లో ప్రజా సమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరైన ఈ సమావేశానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలి

అబద్ధపు ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్య పెడుతున్న కాంగ్రెస్ పార్టీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బొందపెట్టడం ఖాయమని మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటులో ఓటు హక్కులేని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటు వేయడం వలన జరిగే లాభం ఏమి లేదన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న తనను గెలిపిస్తే మల్కాజిగిరి పార్లమెంటును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు కొసనం వెంకట్‌రెడ్డి, పోచబోయిన జగదీశ్‌యాదవ్, నాయకులు నర్రి వెంకన్నకురుమ, ఏలుకొండ రాంకోటి, కేకేఎల్ గౌడ్, సుధాకర్‌నాయి, సూరజ్ యజ్దాని తదితరులు పాల్గొన్నారు.

ఎంఈరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

విద్యార్థులకు అభినందనలు

కందుకూరు. ఏప్రిల్ 30 : పది ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులను వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. ప్రభుత్వ మోడల్ స్కూల్ లో చదువుతున్న ప్రనవి 10 జీపీఎస్ సాధించడంతో ఆమె ఇంటికి వెళ్లి సన్మానించారు. రక్షిత, గీతిక, విద్యార్థులను కూడా సన్మానించిన అనంతరం వారిని అభినందించారు. మండల కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ ఎండీ అప్జల్ భేగ్, గంగుల వెంకట్‌రెడ్డి, సురేశ్,గంగుల చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన అంధ బాలికలు

సైదాబాద్: పది ఫలితాల్లో సైదాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. సైదాబాద్ మండల పరిధిలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 414 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 279 మంది ఉత్తీర్ణత సాధించగా, అందులో 104 మంది బాలురు, 175 మంది బాలికలు ఉన్నారు. మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అంజనేయులు 9.7 జీపీఏ సాధించగా, అదే పాఠశాలకు చెందిన పూజిత 9.5 జీపీఏ, స్పందన 9.5 జీపీఏ సాధించారు. హెచ్ఎం విజయలక్ష్మి విద్యార్థులకు అభినందించారు. మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల విద్యార్థినులందరూ ఉత్తీర్ణత సాధించారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన నాగార్జున విద్యార్థులు

వనస్థలిపురం, ఏప్రిల్ 30 : టెన్ ఫలితాల్లో నాగార్జున విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. 50 మంది విద్యార్థులు 10కి 10 పాయింట్లు సాధించారు. 72మంది 9.8 పాయింట్లు, 73 మంది9.7, 71 మంది 9.5, 458 మంది 9పాయింట్లకు పైగా సాధించారు. విద్యాసంస్థల అకాడమిక్ డీన్ రాజశేఖర్ ఫలితాలను వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వనస్థలిపురంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాగార్జున పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

10కి పది పాయింట్లు సాధించిన విద్యార్థులతో డీన్ రాజశేఖర్‌రెడ్డి

పదిలో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు

చంపాపేట, ఏప్రిల్ 30: 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అమూల్య 10/10, సందీప్‌కుమార్ 9.7, నిఖిత 9.7, స్పందన 9.7, ప్రదేక్ష 9.5, శ్రీజ 9.5, నవ్యశ్రీ 9.5 గ్రేడ్లు సాధించారు. చంపాపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నుస్రత్ అలీ 9.8, అక్షిత 9.7, గ్రేడ్లతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలిచారు.

రాజీవ్‌గాంధీనగర్‌లో..

మన్సూరాబాద్ పది ఫలితాల్లో నాగోల్ డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన తెలుగు, ఇంగ్లీషు మీడియం 66 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 51 మంది ఉత్తీర్ణత సాధించారు.

సత్తా చాటిన విద్యార్థులు

బడంగ్‌పేట, ఏప్రిల్30: జిల్లెలగూడ చల్లాలిగా రెడ్డి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో సత్తా చాటారు. వంశీ వర్ధన్‌కు, కీర్తన్ 10/10జీపీఏ సాధించారు. కార్తీక్‌కు 9.8, శ్రీకాంత్‌కు 9.7 సాధించారు. బడంగ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రనవికి 9.5, సుమతికి 9.2,నాదర్‌గుల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన వైశాలినికి 9.2, గాయిత్రీకి 9జీపీఏ, రావిర్యాల జడ్పీహెచ్‌స్‌కు చెందిన పూజిత కు 9.7,మహేశ్వర్ జడ్పీహెచ్ఎస్ కు చెందిన సాయి చరిత 9.8, లక్ష్మికి 9.5, లావణ్యకు 9.5 జీపీఏ సాధించి సత్తాచాటారు. జిల్లెలగూడ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన వంశీ వర్ధన్, కీర్తనను ఎంఈవో కృష్ణయ్య అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం గర్వంగా ఉందన్నారు. మంచి ఫలితాలు సాధించిన్నందుకు ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు.

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతోనే చేవెళ్ల అభివృద్ధి

ఎన్టీఆర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పెండ్యాల నగేశ్, మురుకుంట్ల అరవింద్‌శర్మ

ఆర్కేపురం, ఏప్రిల్ 30 : కాంగ్రెస్ అంటేనే నయవంచన పార్టీ మోసపూరిత మాటలు, ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలతో గద్దె నెక్కిందని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఎన్టీఆర్‌నగర్ ఫేస్-3లోని శ్రీ దుర్గా మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహించిన కాసానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల అభివృద్ధి కోసం కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. సాజీద్, పటేల్ సునీతారెడ్డి, ఊర్మిలారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కందుకూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ తెలిపారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం మండల పరిధిలోని ముచ్చర్ల. సాయిరెడ్డిగూడ, ఊట్లపల్లి, తదితర గ్రామాల్లో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలుకానీ హామీలను ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, డైరెక్టర్ పొట్టి ఆనంద్, మాజీ డైరెక్టరు సామ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీల మద్దతు కాసాని జ్ఞానేశ్వర్‌కు ప్రకటించారు. దన్నారం,చిప్పలపల్లి గ్రామాల్లో సమావేశం నిర్వహించి తీర్మానించారు.

రూ. 4 లక్షలతో క్యాషియర్ ఉడాయింపు

మన్సూరాబాద్, ఏప్రిల్ 30: పెట్రోల్ బంకులో పని చేస్తున్న ఓ హెడ్ క్యాషియర్ రూ. 4 లక్షలతో ఉడాయించిన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పెట్రోల్ బంకు మేనేజర్ యుదిష్టర్ రెడ్డి కథనం ప్రకారం.. నాగోల్, సాయినగర్ కాలనీలోని కైలాస్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంకు)లో కరీంనగర్‌కు చెందిన సతీశ్ 6 సంవత్సరాలుగా హెడ్ క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. పెట్రోల్ బంకు మరో క్యాషియర్ వీరేశ్ సెలవులో ఉన్నాడు. శని, ఆదివారం బ్యాంకు సెలవు కావడంతో డబ్బులను పెట్రోల్ బంకు కార్యాలయంలో భద్రపరిచాడు. సతీశ్ ఈ విషయాన్ని తెలుసుకొని సెలవులో ఉన్న వీరేశ్‌కు ఫోన్ చేయగా తాశం చెవులు పెట్రోల్ బంకు కార్యాలయంలోనే ఉన్నాయని చెప్పాడు. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన పెట్రోల్ బంకు మేనేజర్ యుదిష్టర్‌రెడ్డి, క్యాషియర్ వీరేశ్ డబ్బులను లెక్కించారు. రూ. 8 లక్షలు ఉండాల్సి ఉండగా రూ. 4 లక్షలు మాత్రమే ఉన్నాయి. డబ్బులు రూ. 4 లక్షలు తక్కువగా ఉన్న విషయాన్ని తెలిపేందుకు క్యాషియర్ సతీశ్‌కు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. దీంతో పెట్రోల్ బంకు మేనేజర్ యుదిష్టర్ రెడ్డి నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.